ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శనివారం | 07 నవంబరు , 2026 | పేజీలు : 6

వైభవంగా ప్రారంభమైన నసీరుద్దీన్ బాబా గంధం ఊరేగింపు



మండల అధ్యక్షుడు గుడిపెల్లి మధుకర్ రెడ్డి, జిల్లా కార్య దర్శి వేల్పుల రమేష్, మాజీ జెడ్పీటీసీ కొరపిడత అవి లయ్య, దేవస్థాన చైర్మన్ బీరవోలు విక్రమ్ రెడ్డి, సర్పంచ్ చిల్లంచర్ల విద్యాసాగర్, శిగ నసీర్ గౌడ్, వక్ఫ్ బోర్డు అసి స్టెంట్ సెక్రటరీ అమీర్ అహ్మద్ పాల్గొన్నారు.

ప్రజా పక్షం/ అర్వపల్లి : మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన అర్వపల్లి హజ్రత్ సయ్యద్ ఖాజా నసీరుద్దీన్ బాబా ఉర్సు ఉత్సవాల్లో ప్రధానమైన గంధం ఊరేగింపును శుక్ర వారం రాత్రి సాంప్రదాయ గా అర్వపల్లి పోలీస్ స్టేషన్ లో ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం ఎమ్మెల్యే మందుల సామేల్ గంధం ఊరేగిం పును ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు బాబాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీస్ అధికారులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో

ప్లెక్సీలో కొప్పుల ఫోటో గల్లంతు

పొరపాటున మిస్సయ్యిందా... కావాలనే పెట్టలేదా
కాంగ్రెస్‌లో చర్చపోచర్చలు



ప్రజాపక్షం/సూర్యాపేట: సూర్యాపేట జిల్లా పట్టభ ద్రుల శాసనమండలి ఎన్నికల సన్నాహక సమావేశం శుక్రవారం జిల్లా కేంద్రంలోని రవి మహల్‌లో ఏర్పాటు చేశారు. దీనికి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ఫోటో గల్లంతైంది. ఆయన ఫోటో పొరపాటున మిస్సయ్యిందా లేక కావా లనే పెట్టలేదా అనే దానిపై కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చపో చర్చలు సాగుతున్నాయి. మాజీ మంత్రి, దివంగత నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డి అనుంగ్య శిష్యుడిగా నాలుగు దశాబ్దాల పాటు కలిసి పనిచేసి ఎంతో రాజ కీయ అనుభవం ఉన్న కొప్పుల వేణారెడ్డి ఫోటో పెట్టక పోవడంతో ఆయన అభిమానులు జీర్ణించుకోలేకపో తున్నారు. దామోదర్ రెడ్డి మరణానంతరం అతని తన యుడు ఏఐసిసి సభ్యులు, ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల శాసనమండలి నియో జక వర్గ కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి వేణారెడ్డి మధ్య విభేదాలు పొడచూపాయి. ఈ ఇరు వురు నేతలు గత ఏడాది కాలంగా ఎవరికి వారు వేరు వేరుగా పార్టీ కార్యక్రమాలు చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఈ ఇరువురి నేతల మధ్య విభేదాలు ఉన్నా వేణారెడ్డి మాత్రం ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన సర్వోత్తమ్ రెడ్డికే తన మద్దతు అంటూ పత్రికా ముఖంగా ప్రకటించారు. ఎన్ని విభేదాలు ఉన్నా పక్కకు పెట్టి ఎమ్మెల్సీ ఓట్ల నమోదు కోసం సూర్యాపేట జిల్లా కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో పట్టభద్రుల ఓటు నమోదు సహాయ కేంద్రాలను పెద్దఎత్తున ఏర్పాటు చేశారు. తన అనుచ రులను మొత్తం గత రెండు మాసాలుగా ఈ పనిలోనే బిజిగా ఉన్నారు. తన రాజకీయ గురువు, దివంగత నేత దామోదర్ రెడ్డి రాజకీయాల్లో పాటించిన రాజనీ తిని తాను కూడా నేర్చుకున్నానని దానిని ఏనాడు విడ వకుండా కాపాడుకుంటూ వస్తానని అనేక సభల్లో, ఇంటర్వూలలో ప్రకటించారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు సంపూర్ణ మద్ధతు ఇవ్వాలంటూ సర్వోత్తమ్ రెడ్డి కాలుకు బలపం కట్టుకొని శాసనమండలి నియోజక వర్గ పరిధిలో ఉన్న రాష్ట్ర మంత్రులు, ఎంపిలను, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలతోపాటు ఆయా ప్రాంతాల్లో ఉన్న కీలకనేతలను కలుస్తూ మద్ధతు కూడ గట్టుకుంటున్నారు. కానీ ఇప్పటి వరకు కొప్పుల వేణా రెడ్డిని కలిసి తనకు మద్ధతు ఇవ్వాలని కోరిన దాఖ లాలు లేవు. ఈ ఇరువురి నేతల మధ్య పెరిగిన దూరాన్ని తగ్గించి ఒక్కటి చేయాలని దామోదర్ రెడ్డి సోదరులు గోపాల్ రెడ్డి, కృష్ణారెడ్డిలు ఎంత ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయిందని పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక లవేళ ఈ ఇరువురి నేతలు ఏకమైతే పార్టీకి మరింత బలం చేకూరే అవకాశం ఉందని రాజకీయ విజ్ఞులు వాపోతున్నారు.



కార్యకర్తలపై మంత్రి ఉత్తమ్ ఆగ్రహం

ప్రజాపక్షం/ సూర్యాపేట: ఎవడ్రా నువ్వు.... చల్ నోర్ముయ్ అంటూ రాష్ట్ర పౌరసరఫరాల, నీటిపారుదల శాఖ ల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తమ పార్టీకి చెందిన కార్యకర్తపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాళ్లను బయటికి పొమ్మంటూ పోలీసులకు హుకుం జారీ చేయడం అందరినీ ఒక్కసారిగా విస్మయానికి గురిచేసింది. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రవి మహల్ లో శుక్రవారం ఉమ్మడి నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ని గెలిపించాలని కోరుతూ నిర్వహిం చిన సనహక సమావేశంలో ఇది చోటు చేసుకుంది. దీనికి సంబంధిం చిన వివరాల్లోకి వెళ్తే సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేనా రెడ్డి ఫోటో పెట్టకపోవడానికి తప్పుపడుతూ ఆయన వర్గానికి చెందిన కార్య కర్తలు తప్పుపడుతూ కార్యక్రమ నిర్వాహకులను నిలదీశారు. 40 సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతి కోసం పాటుపడుతున్న వేనా రెడ్డి ఫోటో పెట్టకపోవడం ఏంటని... ఉద్దేశపూర్వకంగా నే పెట్ట లేదని రచ్చ చేశారు. ఇది పార్టీకి మంచిది కాదంటూ మైనార్టీ నాయ కులు సాజిద్ ఖాన్ ఆధ్వర్యంలో మరికొంతమంది వేనా రెడ్డి వర్గీయు లను అక్కడ ఉన్న ఉన్న సర్వోత్తమ్ రెడ్డి వర్గీల తో వాగ్వాదానికి దిగాడు. దీంతో సమావేశం గందరగోళంగా మారడంతో వేదిక పైనున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆగ్రహానికి లోనయ్యాడు. 'ఎ వడ్రా నువ్వు ' చల్ నోర్ముయ్.... అంటూ అక్కడ ఉన్న వారిని బయ టికి పంపడంటూ పోలీసులకు హుకుం జారీ చేశారు. కాంగ్రెస్ కార్య కర్తలకు పోలీసులకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. అక్కడే ఉన్న వేనా రెడ్డి నీ మంత్రి ఉత్తమ్ పిలిచి పిలిచి అసహనం వ్యక్తం చేశారు. వారిని అదుపు చేయాలని ఆదేశించాడు. దీనిపై చర్చించు కుని ముందుకు పోదామని చిల్లర పంచాయతీలు వద్దని... బేధాభిప్రా యాలు లేవన్నారు. సర్వోత్తమ్ రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని హితవు పలికారు. ఏది ఏమైనా మంత్రి కార్యకర్తల పై ఆగ్రహం వ్యక్తం చేయడం చర్చ నియాంశంగా మారింది.

బియ్యం ధరల నియంత్రణకు ప్రత్యేక అవుట్‌లెట్



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: బియ్యం ధరల నియంత్రణకు ప్రత్యేక అవుట్‌లెట్ ఏర్పాటు చేసినట్లు నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు బియ్యం అమ్మే దుకు ఏర్పాటు చేసిన అవుట్‌లెట్‌ను ఆయన ప్రారంభించారు. ఎలొనినో ప్రభావం నేపథ్యంలో నిత్యావసర సరుకుల ధరలు, ప్రత్యేకించి బియ్యం ధరలను నియం త్రించి అమ్మాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నల్గొండ జిల్లా మిర్యాలగూ డలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సహకారంతో ఈ ప్రజా బాహుళ్య కార్యక్రమాన్ని తక్షణమే అందుబాటులోకి తీసుకువచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బియ్యం ధరల నియంత్రణలో భాగంగా మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రభుత్వం సూచించిన ధరలకే ప్రజలకు బియ్యాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ముందుగా ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. నిర్దేశించిన ధర లతో ఏర్పాటు చేసిన ఈ బియ్యం అవుట్‌లెట్ సేవలను ఎలొనినో ముగిసే వరకు నిరంతరాయంగా కొనసాగించాలని సూచించారు.మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రతి పేదవాడికి బియ్యం అందుబాటులో ఉండాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం బియ్యం ధరలను నిర్దేశించిందని తెలిపారు. ప్రతి పేదవాడి ఆకలి తీర్చేందుకు కేజీ రూ.66 చొప్పున బియ్యం అమ్మే విధంగా అవుట్ లెట్లను సిద్ధం చేశారని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలోనే మొదటిసారిగా మిర్యాలగూడలో ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు బియ్యం అవుట్‌లెట్‌ను ప్రారంభిం చడం సంతోషకరమని పేర్కొన్నారు. పేద ప్రజలను ఆదుకునేందుకు తాను ఎల్ల ప్పుడూ సిద్ధంగా ఉంటానని, ఏ సమస్య వచ్చినా నేరుగా తన వద్దకు రావచ్చని తెలి పారు.రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మిర్యాలగూడ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లా డుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే పేద, మధ్యతర గతి, ఉన్నత తరగతుల కుటుంబాలకు నాణ్యమైన బియ్యం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఎవరు ఎంత బియ్యం కోరినా, ఎన్ని లారీలు కావాలన్నా నిరంతరాయంగా సరఫరా చేసేందుకు రైస్ మిల్లర్స్ అసోసియేషన్లు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్ల సంఘం కార్యదర్శి బాబితోపాటు పలువురు ప్రతినిధులు మాట్లాడారు. ఈ క్రమంలో ప్రభుత్వం నిర్ణయించిన రీతిలోనే స్థానిక ప్రజలకు బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రామ్‌పతి నాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశం, మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, మున్సి పల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

స్వేరోలు బలమైన ఆర్థిక శక్తిగా ఎదగాలి

ప్రజాపక్షం/కోదాడ రూరల్ : స్వేరోలు బలమైన ఆర్థిక శక్తిగా ఎదగా లని స్వేరోస్ నెట్‌వర్క్ వ్యవస్థాపకులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని చిలుకూరు గ్రామంలోని కందుకూరి గురవయ్య కుటుంబానికి భీమ్ హోమ్ నిర్మాణానికి శంకు స్థాపన చేసి మాట్లాడారు. స్వేరోలు ఎవరిపై ఆధారపడకుండా, ఎక్కడా తలవంచకుండా సొంతంగా అభివృద్ధి చెందాలని కోరారు. చివరి శ్వాస వరకు పేద వర్గాల కోసమే కృషి చేస్తానన్నారు. గురు వయ్య అకాల మరణం చెందగా, స్వేరోస్ నెట్‌వర్క్ నాయకులందరూ కలిసి బాధిత కుటుంబానికి ఇంటి నిర్మాణం ప్రారంభించడం శుభప రిణామమన్నారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ రాష్ట్ర అధ్యక్షులు బత్తిని వీరయ్య, నాయకులు చెడపంగు రవి కుమార్, పిడమర్తి దశరథ, జిల్లా పల్లి శివకృష్ణ, విజయ నిర్మల, జ్యోతిరాణి, సునీత పాల్గొన్నారు.





గ్రామ ప్రజలు సద్వినియోగం

ప్రజాపక్షం/అనంతగిరి: వివిజి రాంజీ పథకం పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు కోరారు. శుక్రవారం మండల పరిధిలోని వాయిలసింగారం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. కొలత ప్రకారం సగటును 308 రూపాయల కూలి పొందాలని, ఎల్‌నినో ప్రభావం వల్ల అనంతగిరి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించినందువల్ల పని దినాలను 100 రోజుల నుండి 125 రోజులకు పెంచడం జరిగిందన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరు కొత్త జాబ్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్ చింతనునిత, మేట్లు సుబ్బారావు, గడ్డం వీరబాబు, చవ్వా త్రివేణి, కొల్లు స్వప్న, కూలీలు పాల్గొన్నారు.

ఆరు పత్తికొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

ప్రజాపక్షం/నేరేడుచర్ల: పత్తి రైతుల సౌకర్యార్థం సూర్యాపేట జిల్లాలో ఆరు పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి పి.దామోదర్ తెలిపారు. శుక్రవారం నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చింతలపాలెంలో రెండు కేంద్రాలు, సూర్యాపేట లో ఒకటి, తిరుమలగిరిలో మూడు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పత్తికి క్వింటాల్‌కు 8667 మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. పత్తి విక్రయించాలనుకునే రైతులు తప్పనిసరిగా కిసాన్ యాప్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. మార్కెట్ కమిటిల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. సూర్యాపేట మార్కెట్ కమిటికి 3.75 కోట్లు, హుజూర్‌నగర్‌కు 4 కోట్లు, నేరేడుచర్ల మార్కెట్ కమిటికి 43.50 లక్షలు మొత్తం 8కోట్ల 18 లక్షల 50వేలు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి కార్యదర్శి సన్ని పాల్గొన్నారు.

రైతులకు పెసర, మినుము విత్తనాలు పంపిణీ

ప్రజాపక్షం/గరిడేపల్లి: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ వ్యవసాయ కళాశాల, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో రైతు పొలాల్లో ఆవిష్కరణలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు పెసర, మినుము విత్తనాల కిట్స్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా శాస్త్రవేత్తలు చంద్రశేఖర్; శివ ప్రసాద్ లు మాట్లాడుతూ ప్రస్తుత ఎల్‌నినో ప్రభావిత వాతావరణ పరిస్థితుల్లో నీటి ఎద్దడిని తట్టుకుని, తక్కువ నీటి వనరులతో అధిక లాభాలను అందించే పంటలను సాగు చేయాలని, సత్రజనిని స్థిరికరించే సూక్ష్మ జీవుల మిశ్రమాన్ని కూడా పంపిణీ చేశారు. మండల వ్యవసాయ అధికారి ప్రియతమ్‌కుమార్, ఎఈవోలు శిరిష, సంధ్య, రైతులు నలబోలు శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



నేరేడుచర్ల మార్కెట్ కమిటీ అభివృద్ధికి ప్రతిపాదనలు



ప్రజాపక్షం/నేరేడుచర్ల: వ్యవసాయ మార్కెట్ కమిటి అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయల కల్పనపై పాలకమండలి సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. శుక్రవారం నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యాలయంలో చైర్‌పర్సన్ చలసాని స్పందన రాజీవ్ అధ్యక్షతన పాలకమండలి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో మార్కెట్ కమిటి కార్యాలయంలో నూతనంగా చైర్మన్ చాంబర్ సమావేశం మందిరం నిర్మాణంతో పాటు కార్యాలయ నిర్వహణకు అవసరమైన మరమ్మతు పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించి వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సంచాలకులకు పంపాలని తీర్మానించారు. అదే విధంగారైతులకు ఉపయోగపడేలా నాబార్డు గోదాం నిర్మాణానికి మరోసారి ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించారు. నాబార్డు గోదాం నిర్మాణం కోసం పాలకవీడు మండలం గుడిగుంట్లపాలెం గ్రామ పరిధిలో మూడు ఎకరాల స్థలం కేటాయించేలా సంబంధిత అధికారులకు ప్రతిపాదనలు పంపాలని సమావేశంలో తీర్మానించినట్లు చైర్మన్ స్పందన రాజీవ్ తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ మునగాల భాస్కర్‌రెడ్డి, పాలకమండలి సభ్యులు కర్ణం రామనర్సయ్య, బుర్రి వెంకయ్య, సురోజు రవీంద్రచారి, ఉటుకూరు సైదులు, పల్లె కాశయ్య, కత్తి శ్రీనివాసరెడ్డి, సైదు, వశ్యనాయక్, చింతలచెర్వు ప్రియాంక, పోతురాజు జ్యోతి, రెబ్బ రమేష్, పోలా విశ్వనాధం, జిల్లా మార్కెటింగ్ అధికారి దామోదర్, కార్యదర్శి సన్ని పాల్గొన్నారు.

సమస్యల వలయంలో 4వ వార్డు



ప్రజాపక్షం/చిట్యాల: నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటిలోని 4వ వార్డు ప్రజలు మౌలిక వసతుల సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిషన్ భగీరథ పైపులైన్ ఏర్పాటు కోసం గతంలో తవ్విన సిసి రోడ్లకు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు మరమ్మత్తులు చేపట్టకపోవడంతో రహదారులు ఆధ్వాన్నంగా మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు వార్డులోని పలు వీధుల్లో ఓపెన్ డ్రైనేజీలు ఉండటంతో మురుగు నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోందని, దోమల బెడద పెరిగి ప్రజలు అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారని వాపోతున్నారు. వార్డులోని దాదాపు అన్ని వీధుల్లో ఇదే పరిస్థితి నెలకొందని, మురుగు నీటి కాలువలకు సరైన నిర్వహణ లేకపోవడంతో నివాసితులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. నల్లా పైపు లైన్ల కోసం తవ్విన గుంతలు సైతం పూడ్చకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, పారిశుద్ధ్య సమస్యలతో నిత్యం అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చిన పరిష్కారం లభించకపోవడంతో వార్డు ప్రజలు శుక్రవారం సంతకాల సేకరణ చేపట్టి, సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమీషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

పాలకుల రైతాంగ వ్యతిరేక విధానాలపై సమరభేరి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పాలకుల రైతాంగ వ్యతిరేక విధానాలపై సమరభేరి మోగించాలని రైతు సంఘం జాతీయ నాయకులు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి వీరేపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన మిర్యాలగూడ డివిజన్ స్థాయి సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు నల్లగొండ జిల్లా కేంద్రంలో రైతు సంఘం 36వ జాతీయ మహాసభలు జరగనున్నాయని తెలిపారు. నల్లగొండ జిల్లా పోరాటాల పురిటిగడ్డ అని, ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభమయ్యే జాతీయ రైతు మహాసభలు రైతాంగ పోరాటాలకు సరికొత్త శ్రీకారం చుట్టనున్నాయని పేర్కొన్నారు.దేశంలో అత్యధిక సంఖ్యాకులైన రైతులు అహోరాత్రులు కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో డబ్బీకార్ మల్లేష్, రవినాయక్, శశిధర్ రెడ్డి, వినోద్, గౌతమ్‌రెడ్డి, పాండు, నూకల జగదీష్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి



ప్రజాపక్షం/నాంపల్లి : గ్రామాలలో నీటి కొరత,విద్యుత్ సమస్యలు ఉన్న నేపథ్యంలో అవసరం ఉన్నంత వరకే విద్యుత్‌ను వాడాలని,ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ రామకృష్ణ శర్మ సూచించారు.మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల పని విధానాలను వివరించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు,ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత,విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన,వైద్య సేవలు,పారిశుద్ధ్య నిర్వహణ,తాగునీటి సరఫరా,గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమీక్షించారు.పసునూరు సర్పంచ్ గోవర్ధన్ మాట్లాడుతూ అభివృద్ధి పనులపై ఉప సర్పంచ్ స్పందించడం లేదని,తీర్మానాలపై సంతకం చేయడం లేదని,రెండు నెలల నుంచి పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎంపీడీఓ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయబ్ తహసీల్దార్ దోటి వెంకన్న, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.ఎలమందయ్య,మండల వైద్యాధికారి డాక్టర్ భవాని,ఎంపీఓ మధు, వ్యవసాయ అధికారి బండారు శివ,ఏపీవో గుంటుక వెంకటేశం,ఏపీఎం,వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



చండూరులో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలి

ప్రజాపక్షం/చండూరు: రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉన్న చండూరులో జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఏర్పాటు చేయాలని కోరుతూ ఆ ప్రాంత న్యాయవాదులు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంకు వినతి పత్రం అందజేశారు.చండూరులో కోర్టు ఏర్పాటుకు ప్రభుత్వ స్థాయిలో చొరవ తీసుకొని కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ చండూరు,మునుగోడు,నాంపల్లి,మర్రిగూడ,గట్టుప్పల్ మండలాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చండూరులో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయడం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల ప్రజలు న్యాయపరమైన అవసరాల కోసం నల్లగొండ, దేవరకొండ వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని,దీంతో సమయం,డబ్బు వృథా కావడంతో పాటు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గుర్రం వెంకట్‌రెడ్డి,గిరి లింగయ్య గౌడ్,డి.నర్సాజీ,ఆవుల ప్రేమ్‌సుందర్,పందుల సైదులు, భువనగిరి రవి,ఏలే వెంకటేశ్వర్లు,బరిగెల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భద్రత ప్రమాణాలు తప్పనిసరి



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: దీపావళి పండుగకు బాణాసంచాలు విక్రయించే దుకాణ యాజమానులు భద్రత ప్రమాణాలు పాటించాలని హుజూర్‌నగర్ ఫైర్ ఎస్ఐ సుబ్బారెడ్డి అన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకుని తాత్కాలిక బాణసంచా దుకాణాల నిర్వహణ, అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై శుక్రవారం హుజూర్‌నగర్‌లోని ఫైర్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అంతకు ముందు బాణసంచా దుకాణాల నిర్వాహకులతో సమావేశమై పలు భద్రత సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణదారులు తప్పనిసరిగా లైసన్స్ పొందిన ప్రాంగణంలోనే దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని, నిబంధనల ప్రకారం రేకుల షెడ్లు నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ పోలీస్ సిబ్బంది, దుకాణదారులు పాల్గొన్నారు.

వరి సాగుకు స్వస్తి పలకాలి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: యాసంగిలో వరి సాగుకు స్వస్తి పలికి ప్రత్యామ్నాయ ఆరుతడి పంటల సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని వ్యవసాయ అధికారి రుషేంద్రమణి స్పష్టం చేశారు. శుక్రవారం మిర్యాలగూడ మండలంలోని జప్తివీరప్పగూడెం, శ్రీనివాస్‌నగర్ గ్రామాల్లోని విత్తన దుకాణాల వద్ద రైతులకు యాసంగి పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులు మరియు రానున్న తీవ్రమైన నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని యాసంగి సీజన్‌లో వరి సాగుకు బదులుగా కంది, పెసర, మినుము, శనగ, నువ్వులు వంటి ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జప్తివీరప్పగూడెం సర్పంచ్ వెంకటయ్య, హరిబాబు, శ్రవణ్, సత్యనారాయణ, సీత్యతండా రవినాయక్, ఏఈఓ నాగయ్య, శేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

ప్రజాపక్షం/మోటకొండూర్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆటో డ్రైవర్ దేవరాజు లక్ష్మణ్ కు ముత్తిరెడ్డిగూడెం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో 10వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో గుర్రాల రవి, పైళ్ల వెంకటరెడ్డి, గంధ మల్ల పాండు, ఉపసర్పంచ్ మంచాల వెంకన్న, మర్రిపల్లి సాయి కిరణ్, గుర్రాల శేఖర్, మర్రిపల్లి జహంగీర్, నూనెమంతుల సంతోష్, వేముల రాజు, గంగరబోయిన రమేష్, బురాన్, దేవల్ల ఎలెంధర్ శనిగరం రఘుపతి, కప్పే మల్లేష్, దేవరాజు కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



జిజ్ఞాస రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎన్‌జి విద్యార్థినులకు బహుమతులు

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన జిజ్ఞాస రాష్ట్ర స్థాయి పోటీలలో స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల ఉర్దూ, బయోటెక్నాలజీ విభాగం విద్యార్థినులు మొదటి,రెండవ బహుమతులు సాధించారు.కమిషనర్ ఆఫ్ కాలేజీ ఎడ్యుకేషన్ ఆదేశానుసారం శుక్రవారం మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అడిషనల్ ఎస్‌పి రమేష్, ఉమ్మడి జిల్లా ఐడీ కాలేజ్ ప్రిన్సిపల్ సముద్రాల ఉపేందర్,ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరాజు ముఖ్యఅతిథులుగా హాజరై గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రొఫసర్ ఎస్.రామారావు,డాక్టర్ సయ్యద్ సైఫుల్లా బాషా, జిజ్ఞాస సూపర్‌వైజర్లు ఉర్దూ లెక్చరర్ సైఫుల్లా బాషా, బయోటెక్నాలజీ లెక్చరర్ పి.పుష్పలత పాల్గొన్నారు.

మేట్లకు శిక్షణ కార్యక్రమం



ప్రజాపక్షం/గుండాల; ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేకపోవడంతో కరువు ఏర్పడుతుండడంతో గ్రామాలలో పనులు లేక ప్రజలు వలసలు పోకుండా కూలీలకు ఎక్కువ పనులు కల్పించాలని గుండాల ఎంపిడిపో చంధీరాణి అన్నారు. శుక్రవారం గుండాల మండల పరిధిలోని సుద్దాల గ్రామంలో మేట్లకు ఏర్పాటు చేసిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఎంపిడిపో చంధీరాణి పాల్గొని మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 125 రోజుల పని కల్పించాలని, కొత్తగా పెళ్లైన వారికి నూతన జాబ్ కార్డులు ఇవ్వాలని, పారం పాండ్స్, ఇంకుడు గుంతలు, పంట కుంటలు, బోర్వేల్ రిచార్జీ పాండ్స్ పనులు ఎక్కువగా చేయించాలని సూచించారు. మేట్ల మాస్టర్‌లలో కొట్టివేతలు, దిద్దడం లేకుండా నిర్వహించాలని అన్నారు. ఈకార్యక్రమంలో సంబంధిత అధికారులు ఇమాన్యుయేల్, ఆయా గ్రామాలకు సంబంధించిన మేట్లు తదితరులు పాల్గొన్నారు.

భూముల లీసర్వేపై ఆందోళన వద్దు

ప్రజాపక్షం/అర్వపల్లి : భూభారతి భూముల రీసర్వేపై రైతులు ఎలాంటి ఆందోళనపడవద్దని తహశీల్దార్ బి. శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం జాజిరెడ్డిగూడెం గ్రామంలో జాజిరెడ్డిగూడెం, కేసారం భూభారతి భూముల రీ సర్వేపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు భూ సర్వే ఎలా మొదలు పెడతారు, ఎలా నిర్ణయిస్తారు, ప్రభుత్వం భూములు, దేవాలయ తదితర భూములు కొలత ఏవిధంగా పూర్తి చేస్తారనే విషయాలపై అవగాహన కల్పించారు. సర్వే అనంతరం రైతులకు నోటీసులు అందజేసి 30 రోజుల్లోపు రైతులకు అన్ని రకాల అభ్యంతరాలు కూడా తీసుకోవడం జరుగుతుందని సూచించారు. గ్రామ సర్పంచులు బింగి కృష్ణమూర్తి, చిల్లంచర్ల విద్యాసాగర్, కమటం స్వర్ణలత, వార్డు సభ్యులు, గ్రామాల రైతులు పాల్గొన్నారు.



ఆస్ట్రోసేజ్ క్వెస్ట్‌లో శివానీ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: శాస్త్ర, సాంకేతిక రంగాలపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఆస్ట్రోసేజ్ క్వెస్ట్ టాలెంట్ టెస్ట్‌లో శివానీ హైస్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని పాఠశాల డైరెక్టర్ కే.శ్యామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మిర్యాలగూడలోని శివానీ హైస్కూల్‌లో ఇస్రో రిజిస్టర్డ్ సంస్థ అయిన రూట్స్ ఎడ్యుటెక్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నలుగురు విద్యార్థులకు సర్టిఫికెట్లతో పాటు ఒక్కొక్కరికి రూ.7వేల విలువైన రోబోటిక్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా రూట్స్ ఎడ్యుటెక్ సర్వీసెస్ సీఈఓ డాక్టర్ సంజీవ్‌కుమార్ విద్యార్థులకు సర్టిఫికెట్లు, రోబోటిక్ కిట్లను అందజేసి అభినందించారు. ఆస్ట్రోసేజ్ క్వెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన టాపర్లకు రోబోటిక్స్ మరియు అంతరిక్ష విజ్ఞానానికి సంబంధించిన అంశాల్లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోబోటిక్ కిట్లను అందుకున్న విజేతల్లో 6వ తరగతి విద్యార్థి బి.జతిన్‌రెడ్డి, 7వ తరగతి విద్యార్థి డి.సుదీక్ష, 8వ తరగతి విద్యార్థి కె.లోహిత్‌రెడ్డి, 9వ తరగతి విద్యార్థి ఎం.ఆదిత్య నిలిచారు. విజేతలైన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ కే.శ్యామ్‌సుందర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.



పిల్లల అభిప్రాయాలే ప్రాధాన్యం...



చైల్డ్ ఫ్రెండ్లీ జిల్లాగా సూర్యాపేట

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : సూర్యాపేట జిల్లాను చైల్డ్ ఫ్రెండ్లీ జిల్లాగా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం మరో ముందడుగు వేసింది. పిల్లల అభిప్రాయాలు, అవసరాలు, సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు యూనిసెఫ్ సహకారంతో చేపట్టిన లిజనింగ్ టు చిల్డ్రన్ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మహిళా, శిశు సంక్షేమ శాఖతోపాటు వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం చేపట్టారు. జిల్లాలో గుర్తించిన 100 పాఠశాలల్లో జిల్లా పరిషత్, ప్రభుత్వ, గురుకుల, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన సుమారు 6వేల మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రూప్ డిస్కషన్ల ద్వారా తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించారు. పిల్లల అభిప్రాయాలను వినడం, వారి హక్కులను పరిరక్షించడం ద్వారా మాత్రమే చైల్డ్‌ఫ్రెండ్లీ జిల్లాను నిర్మించగలమని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పేర్కొన్నారు. ఎట్టిసి కార్యక్రమం ద్వారా సేకరించిన అభిప్రాయాలు, సూచనలు ఆధారంగా పిల్లల అవసరాలను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓలు, సూపర్‌వైజర్లు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మహిళా శక్తి హబ్, సఖీ కేంద్రం సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ పంచాయితీ కార్యదర్శులు, సిఆర్‌పిలు, విద్యాశాఖ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రాజెక్టుల్లో ఎఐ పరిజ్ఞానాన్ని వినియోగించాలి

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : కృత్రిమ మేధ,మెషీన్ లెర్నింగ్‌లో పొందిన పరిజ్ఞానాన్ని విద్యార్థుల ప్రాజెక్టులకు అన్వయించి,నూతన ఆలోచనలను ప్రోత్సహించాలని వైస్ చాన్స్‌లర్ ప్రొఫసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అధ్యాపకులకు సూచించారు.ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకుల కోసం నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డీపీ) ముగింపు సభలో ఆయన మాట్లాడారు.మెషీన్ లెర్నింగ్ మోడళ్లు, ఏజెంటిక్ ఏఐ వంటి అంశాలను విద్యార్థులకు ప్రత్యేక అధ్యయన రంగాలుగా పరిచయం చేసి,ఆయా విభాగాల్లో శిక్షణ ఇవ్వాలన్నారు. అధ్యాపకులు తమ రంగాల్లో నైపుణ్యం పెంపొందించుకునేలా తదుపరి ఎఫ్‌డీపీలను సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ విభాగాలకు విడివిడిగా నిర్వహించాలని సూచించారు.కార్యక్రమాన్ని నిర్వహించిన విభాగాన్ని అభినందించారు.అనంతరం పాల్గొన్న అధ్యాపకులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విభాగ అధిపతి జయంతి,ప్రిన్సిపాల్ డాక్టర్ హరీష్ కుమార్,డీన్ ఆచార్య రేఖ,ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఆచార్య ఆకుల రవి తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యలు పరిష్కరించడమే ప్రధాన బాధ్యత



ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : ప్రజాప్రతినిధులు, అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రధాన బాధ్యతగా పని చేయాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి (ఏఎంసి) చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారుల అత్యవసర సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సుదీర్ఘంగా చర్చించారు. గ్రామాల వారీగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు అందరూ సంయుక్తంగా శ్రమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తహశీల్దార్ గుమ్మి రాజశేఖర్ రెడ్డి, ఎంపిడిఓ ఏ. జానయ్య, ఎంపిఓ బిస్ రాజేశ్వర్, మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్, మండలంలోని ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సహస్ర కుంకుమార్చన

ప్రజాపక్షం/యాదాద్రిభువనగిరి: మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి వేయి నామాల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి శుక్రవారం సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి మరియు సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీ పద్మావతి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన సేవ అర్చక స్వాములు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.

ఫూలే పేరు పెట్టడం అభినందనీయం

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు సామాజిక సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిబా ఫూలే పేరు పెట్టడం అభినందనీయమని బీసీ జేవీసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ తెలిపారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి బీసీ సమాజం తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఫూలే పేరు పెట్టడం ద్వారా ఆయన ఆశయాలకు, సమాజ సంస్కరణల కోసం చేసిన పోరాటానికి తగిన గౌరవం దక్కిందన్నారు. గతంలో మిర్యాలగూడ మున్సిపాలిటీలో జనరల్ మహిళా స్థానంలో ఒక బీసీ మహిళకు అవకాశం కల్పించి బీసీలకు రాజకీయ ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. అదేవిధంగా భవిష్యత్తులో మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని బీసీ సామాజిక వర్గానికి కేటాయించి, తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి విజ్ఞప్తి చేశారు.

విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించాలి



ప్రజాపక్షం /రామన్నపేట: గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయమే ప్రధాన జీవనాధారమని, రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించి సహకరించాలని సింగిల్ విండో చైర్మన్ సంద్యాల బిక్షం రెడ్డి తెలిపారు. శుక్రవారం రామన్నపేట పట్టణ కేంద్రంలో గల భువనగిరి రోడ్డులో గుత్తా నర్సిరెడ్డి ఇంటి వద్ద సిరికొండ పవన్ కుమార్, బెల్లం మల్లేష్, కావలి రాజు ఏర్పాటు చేసిన నూతన ఫెర్టిలైజర్ మరియు విత్తనాల దుకాణాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సర్పంచ్‌లు మారేపల్లి మల్లారెడ్డి, నారపాక మాధవి యాదయ్య, రామన్నపేట ఉప సర్పంచ్ మోటె రమేష్, సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షులు, నిదానపల్లి మాజీ సర్పంచ్ గుత్తా నర్సిరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి జమీరుద్దీన్ పాల్గొన్నారు.

ప్రీ కాస్ట్ పనులు తాత్కాలికంగా నిలిపివేత



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; మండల పరిధిలోని కొలుమం తల్‌పహాడ్ గ్రామ పంచాయతీలో గల రైతు వేదిక పక్కన ఉన్నటువంటి సర్వే నెంబర్ 185లోని వెంచర్‌లో ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్మిస్తున్నటువంటి ప్రీ కాస్ట్ పనులను శుక్రవారం మండల ఆర్ఐ ఓర్సు శ్రీనివాస్ అక్కడికి వెళ్ళి నిలిపివేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతులు ఉన్నటువంటి వెంచర్లలో మాత్రమే ప్రీ కాస్ట్ పనులు చేపట్టాలని సంబంధిత వెంచర్ యజమానులకు సూచించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా మండల పరిధిలో ఎలాంటి వెంచర్లు చేసిన, నిర్మాణ పనులు చేపట్టిన సదరు వెంచర్ యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు నియోజకవర్గ స్థాయి సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశం

ప్రజాపక్షం/చండూరు : భారత కమ్యూనిస్టు పార్టీ మునుగోడు నియోజకవర్గ స్థాయి జిల్లా కౌన్సిల్ సమావేశం నేడు చండూరు మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయం మాధగోని నరసింహ భవన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య తెలిపారు.సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని తెలిపారు.సమావేశంలో ఎల్ నినో ప్రభావం వల్ల ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించనున్నందున నియోజకవర్గ స్థాయి మండల కార్యదర్శులు,జిల్లా కౌన్సిల్ సభ్యులు,ప్రజా సంఘాల మండల బాధ్యులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

ఎల్ నినోపై కూలీలకు అవగాహన

ప్రజాపక్షం/మర్రిగూడ: మండలంలోని రాజాపేట తండా గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ కూలీలకు శుక్రవారం ఎల్‌నినో ప్రభావం,నీటి కొరతపై సర్పంచ్ కొడాల వెంకట్ రెడ్డి,వ్యవసాయ అధికారి సహస్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.రాబోయే రోజుల్లో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని,రైతులు ఇంకుడు గుంతలు నిర్మించుకుని మెట్ట పంటలు వేసుకోవాలని సూచించారు.

ప్రతి కుటుంబంలో సంతోషం వెల్లివిరియాలి

ప్రజాపక్షం/యాదగిరిగుట్ట: అన్నదాతల ముఖాల్లో చిరునవ్వులు, ప్రతి కుటుంబంలో జీవితాల్లో అభివృద్ధితో సంతోషం వెల్లివిరియాలని యాదాద్రి భువనగిరి జిల్లా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్ ఆకాంక్షించారు. శుక్రవారం తన జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం వల్ల వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ఈ పరిస్థితుల వల్ల రైతులు మరియు పాడి రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకూడదని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చయ్య, యాదగిరిగుట్ట పట్టణ అధ్యక్షుడు కరె ప్రవీణ్ కుమార్, మండల అధ్యక్షుడు మహేశ్వర్ సత్యం, భువనగిరి అధ్యక్షుడు సురేష్ రెడ్డి, బీబీనగర్ అధ్యక్షుడు సదానంద్ గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి సురేష్‌పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ అందజేత

ప్రజాపక్షం/చౌటుప్పల్ : చౌటుప్పల్ మునిసిపల్ కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం దివిస్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి,అవసరమైన వారికి మందులు అందజేశారు.అధేవిధంగా రూ.1,75,776 విలువైన నోట్‌బుక్స్‌ను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ సత్తమ్మ,వైద్యులు డాక్టర్ జయంత్‌కుమార్, డాక్టర్ నరేష్,ప్రధానోపాధ్యయులు రాంబాబు, దివిస్ పరిశ్రమ ప్రతినిధులు గోపి,వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మున్నూరుకాపులు ఆన్‌లైన్ ద్వారా సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలి

ప్రజాపక్షం/నూర్యాపేట టౌన్ : తెలంగాణ రాష్ట్రం లోని మున్నూరు కాపులందరూ మున్నూరు కాపు వెబ్‌సైట్ ద్వారా సభ్యత్వ నమోదు చేసుకొని తమ సంఖ్యా బలాన్ని తెలియజేయాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు (పటేల్స్) సంఘం అధ్యక్షులు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మున్నూరు కాపు సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. మున్నూరు కాపులకు అన్ని పార్టీలు రాజకీయంగా ప్రాధాన్యత పెంచాలని, గతంలో మున్నూరు కాపులకు అధిక ఎమ్మెల్యే స్థానాలు ఉండేవని వాటిని తగ్గించుకుంటూ మున్నూరుకాపులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 11న యాదాద్రి శ్రీలక్ష్మీనృసింహ మున్నూరుకాపు అన్నదాన సత్రంలో జిల్లా ముఖ్య నాయకులతో ఎలక్షన్



కమిటి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెపిసి అధ్యక్షులు చందు జనార్థన్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, ఆర్. శ్రీనివాస నాయుడు, దూశిపాల శ్రీనివాస్, శెట్టి విజయభాస్కర్, దంతాల రాంబాబు, దేగల రమేష్, రామసాని రమేష్, ఏనుగుల వీరాంజనేయులు, ఎన్. సత్యనారాయణ, దంతాల పద్మ రేఖ, సందీప్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీ చైర్మన్లుగా ప్రజలచే ఎన్నికైన సర్పంచులనే నియమించాలి



ప్రజాపక్షం/నంస్థాన్ నారాయణపురం: ఇందిరమ్మ కమిటీలను తక్షణమే రద్దు చేసి, వాటి స్థానంలో గ్రామ పంచాయతీలకు ప్రజలచే ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన సర్పంచులను చైర్మన్లుగా నియమించాలని సంస్థాన్ నారాయణపురం మండల సర్పంచులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను జోడించి తెలంగాణలోని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందిస్తోంది. ప్రజల పన్నుల రూపంలో సమకూరుతున్న ప్రభుత్వ నిధులతో అమలవుతున్న సంక్షేమ పథకంపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల పెత్తనం ఏంటని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల ఓట్లతో గెలుపొందిన గ్రామ సర్పంచులకు బాధ్యతలు, అధికారాలు కల్పించకుండా, ప్రజలచే ఎన్నుకోబడని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను ఇందిరమ్మ కమిటీల చైర్మన్లుగా నియమించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. ఈ నిరసన కార్యక్రమంలో సర్పంచులు ఆంగోత్ రాజు నాయక్, వీరేశం గౌడ్, సుర్వి సౌజన్య రాజుగౌడ్, ఉప్పల రమేష్ గౌడ్, రామ్ నరసయ్య, బీరయ్య, కురిమిద్ద వినోద్ పాల్గొన్నారు.

రైతులు దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దు



ప్రజాపక్షం/బీబీనగర్: రైతులు దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని పిఎసిఎస్ చైర్మన్ పొట్లోల్ల శ్యామ్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన కాంగ్రెస్ కార్యకర్తలు డైరెక్టర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నీ పలు గ్రామాలలో రైతులు పండించిన ప్రతి గింజను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొంటుందని హామీ ఇచ్చారు. రైతులు తొందరపడి దళారులకు అమ్మి వారి చేతిలో మోసపోవద్దని చెప్పారు. ఎలినినో ప్రభావంతో మన రాష్ట్రంలో ధాన్యం తక్కువ పండిందని రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గోలి పింగల్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుసు రకంటి సత్తి రెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ వాకిటి చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు సంధిగారి బస్వయ్య, మెట్టు శ్రీనివాస్ రెడ్డి, కొమ్మిడి సుభాష్ రెడ్డి పాల్గొన్నారు.

నాబార్డ్ వారి ఆధ్వర్యంలో స్టాండ్ మొగ్గలు, వార్ప్ మిషన్లు, ఆసు మిషన్లకు ఆర్థిక సహాయం

ప్రజాపక్షం/రామన్నపేట: నాబార్డ్ వారి ఆర్థిక సహకారం తో 'సిరిపురం ఇక్కత్ హ్యాండ్లూమ్ వీవర్స్ క్లస్టర్' కార్యక్రమంలో భాగంగా, మీటింగును షార్ప్ సంస్థ అధ్వర్యంలో శుక్రవారం వెల్లంకి గ్రామంలో ఏర్పాటు చేయగా నాబార్డ్‌చీఫ్ జనరల్ మేనేజర్ తెలంగాణ ఉదయభాస్కర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వెల్లంకి నుండి 8, సిరిపురం నుండి 8, బోగారం నుండి 4 గురు, పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మొత్తం 20 మంది లబ్ధిదారులకు స్టాండ్ మొగ్గలు 20, వార్ప్ మిషన్లు3, ఆసు మిషన్లు 3, మూడు గ్రామాలకు ఇవ్వడం జరిగింది. వీటిని నాబార్డ్ సీజీఎం సందర్శించి స్టాండ్ మొగ్గలు, వార్ప్ మిషన్లు, ఆసు మిషన్ లను ప్రారంభించడం జరిగింది. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడి



క్లస్టర్ సభ్యులు అందరు కలసి మాక్స్ సోసిటీగా ఏర్పాటు చేసుకుంటే మరిన్ని అవకాశాలు వస్తాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా బ్యాంకు లింకేజీ ద్వారా 9 మంది లబ్ధిదారులకు 12 లక్షల రుణం ఇప్పించడం జరిగింది. ఈ కార్యాక్రమంలో నాబార్డ్ డిడీఎంయాదాద్రి భువనగిరి ఝాన్సీ రాణి, అసిస్టెంట్ మేనేజర్ రణదీప్, తెలంగాణ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ హరీష్, షార్ప్ సంస్థ సీఈఓ కూరెళ్ల నరసింహా చారి, ప్రోగ్రాం మేనేజర్‌పి నరసింహా చారి, ఫెసిలిటేటర్ అంకం నాగరాజు, కమిటీ సభ్యులు లబ్ధిదారులు పాల్గొన్నారు.



మండల సర్వసభ సమావేశం

ప్రజాపక్షం/నంస్థాన్ నారాయణపురం: వి.హరినాథ్ సంస్థాన్ నారాయణపురం మండల ప్రత్యేకాధికారి గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సర్పంచులు, మండల స్థాయి అధికారుల తో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి గుజ్జ పిఎసియస్ చైర్మన్ డి. యాదిరెడ్డి, ఎంపీడీఓ కె. ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో సంక్షేమ పథకాలన్నింటినీ అర్హులైన లబ్ధిదారులకు అందే లా చూడాలని, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా వంటి ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని, ఇందిరమ్మ కమిటీలను సర్పంచులను అధ్యక్షులుగా తిరిగి ఏర్పాటు చేయాలని పలువురు సర్పంచ్‌లు కోరారు. గ్రామాలలో రైతుల కొరకు విద్యుత్ సౌకర్యంలో ఆటంకం లేకుండా చూడాలని, లూజ్ లైన్‌లను సరి చేయాలని సూచించారు.

నూతన అండర్ గ్రౌండ్ డైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన



ప్రజాపక్షం/రామన్నపేట: పట్టణ ప్రజల దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం చూపే దిశగా రామన్నపేట పట్టణంలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయి. అందులో భాగంగా పట్టణంలోని 7వ వార్డులో నూతన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. స్థానికంగా నెలకొన్న మురుగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే లక్ష్యంతో అభివృద్ధి పనులను ప్రారంభించారు. రామన్నపేట ఉపసర్పంచ్ మోటే రమేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి పనులకు శ్రీకారం చుట్టారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులోకి రావడం ద్వారా వార్డులో మురుగునీరు నిలిచిపోయే సమస్య తొలగిపోనుంది. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఉట్కూరి భారతమ్మ, కొమ్ము శేఖర్ మోటే మహేష్, కొమ్ము రామస్వామి, అన్వర్,నకిరేకంటి సుదర్శన్, గొరిగే శేఖర్,మహ్మద్ జమీర్, బొడ్డు సురేందర్ రావు, ఎం.డి అక్రమ్, నోముల ప్రవీణ్, ఉట్కూరి శ్రీను, కక్కిరేణి రవీందర్ పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

ప్రజాపక్షం/అడ్డగూడూరు: మండలం లక్ష్మీదేవికాల్వ గ్రామంలో విద్యుత్ తీగల నుంచి వెలువడిన నిప్పురవ్వలు గడ్డి వాముపై పడటంతో భారీగా గడ్డి దగ్ధమైందని శుక్రవారం రైతు చెరుకు ఎల్లయ్య ఆరోపించారు. పశువుల మేత కోసం సుమారు 400 కట్టల గడ్డిని సేకరించి నిల్వ ఉంచగా, త్రీ ఫేస్ విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగలడంతో నిప్పురవ్వలు వెలువడి గడ్డి వాముపై పడ్డాయని దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి గడ్డి మొత్తం కాలిపోయిందని పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఎల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. పశువుల మేత కోసం ఎంతో కష్టపడి సేకరించిన గడ్డి కళ్లముందే కాలిపోవడంతో తీవ్ర నష్టానికి గురయ్యానని వాపోయారు. సమాచారం అందుకున్న పోలీసు అధికారులు, అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి ఫైరింజన్తో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. గాలికి మంటలు మరింతగా వ్యాపించకుండా అగ్నిమాపక సిబ్బంది చర్యలు చేపట్టడంతో ప్రమాద తీవ్రత తగ్గింది. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి గ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను పరిశీలించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.





యాసంగిలో వరి సాగుకు దూరంగా ఉండాలి

ప్రజాపక్షం/చండూరు: ఎల్‌నినో ప్రభావం కారణంగా యాసంగి సీజన్‌లో వర్షపాతం తగ్గి, నీటి లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున రైతులు వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలను సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి పి.మల్లేష్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పుల్లెంల, ఇడికూడ గ్రామాలలో ఎల్ నినోపై ప్రజలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమం ప్రత్యేక సభలకు హాజరయ్యి ఆయన రైతులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు సంభవించే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.భూగర్భ జలాలు తగ్గే పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, నీటి లభ్యత ఆధారంగానే పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు.

ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన



ప్రజాపక్షం/చౌటుప్పల్ : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు.నిర్మాణ పనులతో ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు పబ్బు రాజుగౌడ్,సింగిల్‌విండో చైర్మన్ ఈడ్దుల మస్తాన్‌బాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి,మునిసిపల్ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు సుర్వి నర్సింహ్మ,బొబ్బిళ్ళ రాజేందర్, బత్తుల శ్రీహరి,బొబ్బిళ్ల మురళి పాల్గొన్నారు.

లింగయ్య పార్థివదేహానికి నివాళులు



ప్రజాపక్షం/తిప్పర్తి : మామిడాల గ్రామ మాజీ సర్పంచ్ మొకిరాల వెంకన్న తండ్రి మొకిరాల లింగయ్య మృతి చెందడంతో మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి మామిడాల గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి లింగయ్య పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పల్ రెడ్డి రవీందర్ రెడ్డి, లోదంగి గోవర్ధన్, స్థానిక సర్పంచ్ కొత్తపల్లి సైదులు,కందుల లక్ష్మయ్య, పూజర్ల రాజు,యాదగిరి రెడ్డి,బోల్లేదు వెంకన్న, శరత్,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేస్తా

ప్రజాపక్షం/మునగాల: గ్రామాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలతో కృషి చేస్తున్నానని సర్పంచ్ చల్లా గురవయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బరాఖత్‌గూడెం గ్రామంలోని పశువైద్యశాల పూర్తిగా శిధిలావస్థతకు చేరుకోవడంతో స్పందించిన సర్పంచ్ గురవయ్య మరమ్మతులు చేపట్టి ఆధునీకరణలోకి తీసుకవచ్చారు. దీంతో ఆయన పశువైద్యశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువైద్యశాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్



వేనేపల్లి శైలజ రమేష్‌బాబు, నాయకులు బొంతు మోహన్‌రావు, వార్డు మెంబర్లు కుందురు పుల్లా రెడ్డి, కుమ్మరి వెంకన్న, పశువైద్య డాక్టర్లు భాస్కర్, సురేష్, మమత, హరిత, ప్రశాంతి, గోపాలమిత్రలు శ్రీను, నాగరాజు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అన్నపూర్ణకు న్యాయం చేయాలి

ప్రజాపక్షం/తిప్పర్తి : మండలంలోని మామిడాల గ్రామానికి చెందిన వీఓఏ అన్నపూర్ణను ఎలాంటి కారణం లేకుండా విధుల నుంచి తొలగించారని,వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు మంత్రాల మంగమ్మ,మండల అధ్యక్షురాలు ఎండీ రుమాన అధికారులను డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని సమాఖ్య కార్యాలయం ఎదుట మండలంలోని వీఓఏలందరూ నిరసన సమ్మె చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి ఆరోపణలు లేకుండానే రాజకీయ ఒత్తిళ్లతో అన్నపూర్ణను విధుల నుంచి తొలగించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆమెను తిరిగి విధుల్లోకి



తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి ఉద్యోగ భద్రత లేకుండా,కనీస వేతనాలు అందక పోయినా చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వీఓఏలు జి. సునీత, సువర్ణ, సామ్రాజ్యం, రాణి, సంధ్య,వసుమతి, జయమ్మ,లక్ష్మి,మౌనిక, హేమలత,మల్లయ్య,నాగరాజు,పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

రైతు మహాసభ బహిరంగ సభకు తరలిరావాలి

ప్రజాపక్షం/నల్లగొండ: ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు నల్గొండలో నిర్వహించనున్న అఖిల భారత రైతు సంఘం మహాసభలను జయప్రదం చేయాలని,15న జరిగే బహిరంగ సభకు వ్యవసాయ కార్మికులు, గ్రామీణ కార్మికులు, కౌలుదారులు, శ్రామిక వర్గ ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లోని సిపిఐ(ఎం) కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మహాసభల ప్రచారంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో నవంబర్ 9 నుంచి 15వ తేదీ వరకు వారం రోజుల పాటు వేలాది గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఉపాధి హామీ పనుల ప్రదేశాలు, నివాస



ప్రాంతాలు, వ్యవసాయ కార్మిక కూడళ్లలో సభలు,సమావేశాలు,జాతాలు, జనరల్ బాడీలు నిర్వహించి వేలాది మంది కార్మికులను భాగస్వాములను చేస్తామని వెల్లడించారు.దేశంలో సుమారు 40 కోట్ల ఎకరాల సాగుభూమి,15 కోట్ల కమతాలు ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం కేంద్ర కమిటీ సభ్యులు నారి ఐలయ్య,అధ్యక్షులు కత్తుల లింగస్వామి, రాష్ట్ర కమిటీ సభ్యులు బోజ్జ చిన్న వెంకులు, గంధం మల్ల రాములు పాల్గొన్నారు.

నేడు దేవరకొండకు టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కవిత రాక

ప్రజాపక్షం/దేవరకొండ; నేడు దేవరకొండ కు తెలంగాణ రక్షణ సేన పార్టీ అధినేత్రి మాజీ ఎంపి కల్వకుంట్ల కవిత విచ్చేస్తున్నారని తెలంగాణ రక్షణ సేన స్టేట్ ఆల్ యూనివర్సిటిస్ ఇంచార్జీ డా. ఎస్‌సిఎల్ అశోక్ యాదవ్, జిల్లా అధ్యక్షులు పగిడిపాటి విక్రాంత్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి లకుమారపు మల్లయ్య, దేవరకొండ నియోజక వర్గ ఇంచార్జీ శివనాయక్, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు దేవేందర్‌రెడ్డి, విద్యార్ధి నాయకులు అరుణ్‌యాదవ్‌లు తెలిపారు. తెలంగాణాలో పూర్తిగా విపక్షకు గురవుతున్నటువంటి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా కృష్ణా జలాలను నల్గొండ మహబూబ్‌న



గర్ జిల్లాలకు పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవాలని పంటలు ఎండిపోయిన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ కృష్ణా జలాల వినియోగంపై సమగర దృ ష్యా మాధ్యమాన్ని డిండిప్రాజెక్టు వద్ద వారు ఆవిష్కరించనున్నారు. ఈ సమావేశానికి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని, దేవరకొండ పట్టణం లో తెలంగాణ రక్షణ సేన ఆఫీసు ప్రారంభిస్తారని తెలిపారు.

విప్లవ విద్యార్థి వీరుల త్యాగం భవిష్యత్ తరాలకు స్ఫూర్తి

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నవంబర్ 1 నుంచి 11వ తేదీ వరకు నిర్వహిస్తున్న విప్లవ విద్యార్థి అమరవీరుల సంస్మరణ సభల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని వినూత్న జూనియర్ కళాశాలలో సంస్మరణ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు విప్లవ విద్యార్థి అమరవీరులకు నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పీడీఎస్‌యూజిల్లా అధ్యక్షుడు పోలె పవన్ మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమంలో సమాజ మార్పు కోసం,విద్యార్థుల హక్కుల సాధన కోసం పోరాడుతూ ప్రాణాలర్పించిన విప్లవ విద్యార్థి అమరవీరుల త్యాగాలు మరువలేనివని అన్నారు.

ప్రభుత్వ అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి



ప్రజాపక్షం/నకిరేకల్ : ప్రభుత్వ అధికారులు ఎప్పుడూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని,పరిపాలనలో పారదర్శకత పెరిగినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం సిద్ధిస్తుందని తెలంగాణ రాష్ట్ర పోలీస్ అథారిటీ సభ్యులు డాక్టర్ వరె వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.శుక్రవా రం నకిరేకల్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఎన్జీవో సంస్థలు,ప్రజలు,పోలీసులు భాగస్వాములు కావాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. సమాజంలో కులమతాల మధ్య వైషమ్యాలు దేశ ఐక్యతకు,ప్రగతికి, ప్రజాస్వామ్య పరిరక్షణకు పెను ముప్పని హెచ్చరించారు.ఎవరూ కూడా కులాలు, మతాల పేరుతో వైషమ్యాలతో ప్రవర్తించకూడదని,గ్రామాల్లో పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తింపు ఉన్న వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదని,ఇది సమాజంలో ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

ప్రజాపక్షం/నకిరేకల్ : నల్లగొండ జిల్లాలో కరువు మండలాలుగా ప్రకటించిన ప్రాంతాల్లో ప్రభుత్వం వెంటనే సహాయక చర్యలు చేపట్టి రైతులు,వ్యవసాయ కూలీలు, సామాన్య ప్రజలను ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు ఎం.డేవిడ్ కుమార్ డిమాండ్ చేశారు.శుక్రవారం నకిరేకల్‌లోని యానాల మల్లారెడ్డి స్మారక భవన్‌లో జిల్లా అధ్యక్షుడు జ్వాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించి,రుణాలపై ఉపశమనం కల్పించాలని,వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులు, పనిదినాలు పెంచాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి చిరంజీవి,ఉపాధ్యక్షులు గజ్జి రవి,వేముల శంకర్, పుట్ట సత్తయ్య,అంబటి నర్సయ్య, బూరుగు సత్తయ్య,బి.రెడ్డి సత్తిరెడ్డి,ముస్కు అనంతరెడ్డి,కల్లూరి అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: కారుణ్య నియామక పోస్టుల కోసం నకిలీ డెత్ సర్టిఫికెట్లు జారీ చేసి లక్షల రూపాయలతో కారుణ్య నియామక దందా నిర్వహిస్తున్న వైద్యాధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లం మహేష్ డిమాండ్ చేశారు.శుక్రవారం డివైఎఫ్ఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ ఒకవైపు నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఏండ్లకు ఏండ్లు కష్టపడి చదివి ఉద్యోగాలు రాక ఆత్మహత్యలు చేసుకుంటుంటే, వైద్యశాఖ అధికారులు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి లక్షల రూపాయలు చేతులు మార్చుతూ కారుణ్య నియామకాల దందా చేస్తుంటే ప్రభుత్వం వెంటనే స్పందించి విచారణ జరపాలన్నారు. దీంట్లో భాగస్వామ్యం ఉన్న అధికారులను సస్పెండ్ చేసి చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలన్నారు. ప్రభుత్వం ప్రత్యేక కమిటీ వేసి జిల్లాలో ఇంకా ఎన్ని ఇలాంటి దందాలు జరిగాయో సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా ఆఫీస్ బేరర్లు పతాని శ్రీను,పుల్లెంల శ్రీకర్, గుండాల నరేష్, కట్టా లింగస్వామి,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆర్డీఓగా బత్తుల వనజ రాణీ

ప్రజాపక్షం/దేవరకొండ; దేవరకొండ నూతన రాజస్వ మండలాధికారి(ఆర్డీఓ)గా బత్తుల వనజ రాణీ శుక్రవారం దేవరకొండ ఆర్డీఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. దేవరకొండ సబ్ కలక్టర్ కరోలిన్ చింగ్ థియాన్ మావి అస్సాంమేఘాలయ కేడర్‌కు బదిలీ కావడంతో ఆమె స్థానంలో దేవరకొండ నూతన ఆర్డీఓగా బత్తుల వనజ రాణీ బాధ్యతలు స్వీకరించారు.

సూర్యాపేట జిల్లాలో విద్య, వైద్య మౌలిక సదుపాయాలు పెంపొందించేందుకు కృషి

రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



ప్రజాపక్షం/సూర్యాపేట : జిల్లాలో విద్య, వైద్య మౌలిక సదుపాయాలు పెంపొందించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్ర వారం ఆయన సూర్యాపేటలో రూ.190 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జనరల్ ఆసు పత్రి నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. రూ.1.17కోట్ల అంచనా వ్యయంతో ఎస్‌బిఐ, ఐఓసి, కోటక్ మహీంద్రా, అక్షర ఫౌండేషన్ వారి సౌజన్యంతో కొనుగోలు చేసిన ఆధునిక వైద్య పరికరాలైన డిజన్‌లైట్ వెంటిలేటర్లు, మైక్రోటోన్, కటరీ మెషిన్, బ్రోంకో స్కోప్, డెంటల్ చైర్, సిఆర్‌ఎం తదితర పరికరాల ప్రారం భోత్సవం, కాంపెన్సేటరీ అపాయింట్‌మెంట్ ప్రక్రి యలో భాగంగా నియామక ప్రతాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావే శంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో రూ.190 కోట్ల వ్యయంతో 5 అంతస్తుల 1000 పడకల ఆసుపత్రి భవన నిర్మాణంను నాణ్యతతో వేగంగా రెండు, మూడు నెలల్లో పూర్తి చేసి ప్రారంభించడానికి సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో వైద్యం, విద్య మౌలిక సదుపా యాల పెంపొందించుటకు ప్రయత్నం చేస్తానని, హైద రాబాద్ విజయవాడ 4 లైన్ల నేషనల్ హైవేను 6 లైన్‌ల రోడ్‌గా మంజూరు చేయించి త్వరలో పనులు ప్రారం భించడం జరుగుతుందన్నారు. దేవాదుల 6వ ప్యాకేజీ కింద తుంగతుర్తి నియోజక వర్గానికి రూ.1000కో ట్లను మంజూరు చేయించి నీటి తీసుకొస్తానని చెప్పారు. పాత లిఫ్టుల పునరుద్ధరణ, కొత్త లిఫ్టుల పున రుద్ధరణకు కృషి చేస్తానని తెలిపారు. సూర్యాపేట జిల్లాలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి తెల్ల రేషన్ కార్డు ఇప్పించడం జరిగిందని అలాగే 80 శాతం మంది ప్రజ లకు సన్న బియ్యం కూడా ఇస్తున్నామని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో సూర్యాపేట జిల్లాను అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉంచుతానని ప్రకటిం చారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ పార్లమెంట్ సభ్యులు రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పి నర సింహ, మార్కెట్ కమిటి చైర్మన్ వేణారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత, జిజిహెచ్ సూపర్డెంట్ శ్రవణ్, మాజీ పర్యాటక శాఖ కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, వైద్య సిబ్బంది, ఇతర శాఖల అధి కారులు పాల్గొన్నారు.

రిహాబిలిటేషన్ యూనివర్సిటీతో న్యూరో డిసేబుల్డ్ పిల్లల జీవితాల్లో కొత్త వెలుగులు

మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి: దేశంలోనే ఎక్కడా లేనివిధంగా ప్రశాంత వాతావరణంలో యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం దేశ్‌ముఖి గ్రామంలో సేయింట్ మేరీస్ ఎడ్యూకేషన్ గ్రూప్ సంస్థ సేయింట్ మేరీస్ రిహాబిలిటేషన్ యూనివర్సిటి ఏర్పాటు చేసి న్యూరో డిసేబుల్డ్ పిల్లల జీవితాల్లో కొత్త వెలుగులు నింపటం అభినందనీయమని రాష్ట్ర నీటిపా రుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశంసించారు. శుక్రవారం ఆయన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి,నల్లగొండ ఎంపి రఘువవీర్ రెడ్డి,ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య లతో కలిసి రిహాబిలిటేషన్ యూనివర్సిటిని సందర్శించారు.రిహాబిలి టేషన్ సెంటర్,తరగతిగదులు,ఎక్విప్ మెంట్స్‌ను మంత్రి పరిశీలించారు.న్యూరో చిల్డ్రన్‌తో మాట్లాడి వారు తయారు చేసిన బొమ్మలను తిలకించి కొను గోలు చేసి డిసేబుల్డ్ పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. ఈ సందర్భంగా అయనమాట్లాడుతూ న్యూరో చిల్డ్రన్‌ల బాధ్యతను తానే తీసుకొని అన్ని రకాల సౌకర్యాలు కల్పించి వారికి విద్యనందించే సంక ల్పంతో యూనివర్సిటి అనుమతులు తీసుకొని క్లాసు లను రన్ చేస్తూ పిల్లల్లో మార్పుకు కృషి చేస్తున్న చైర్మన్ కేవికే రావును అభినందించారు.ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఈరకంగా సేవ చేయటం తనకు ఒక డ్రీం అనీ ప్రభుత్వం నుండి సంపూర్ణ సహకారాలు ఉంటాయని త్వరలో యూనివర్సిటి ప్రారంభోత్సవా నికి వచ్చి తన వంతుగా న్యూరో పిల్లల విద్య కోసం ప్రోత్సాహం అందిస్తాననీ తెలిపారు.దేశ్ ముఖి సర్పంచ్ దుర్గం జంగయ్య యాదవ్ ఉపసర్పంచ్ నూకల అశోక్ పోచంపల్లి,జూలూరు పిఎసిఎస్ చైర్మన్స్ పాక మల్లేష యాదవ్ కళ్లెం రాఘవ రెడ్డి రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులు డిఎస్‌పి మదుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

డాక్టర్ పెంటయ్య వైద్య సేవలు అభినందనీయం

ప్రజాపక్షం/కోదాడ: డాక్టర్ పెంటయ్య వైద్య సేవలు అభినందనీయమని పశు సంవర్ధక శాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ బి.సుబ్బారాయుడు పేర్కొన్నారు. శుక్ర వారం కోదాడ పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలను సందర్శించిన అనం తరం ఆయన మాట్లాడారు. ప్రాంతాలతో సంబంధం లేకుండా అన్ని రకాల శస్త్ర చి కిత్సలు చేస్తూ సేవలందిస్తున్నారని కొనియాడారు. మూగ జీవాల వైద్యానికి లక్షలు ఖర్చయ్యే శస్త్ర చికిత్సల కూడా ఉచితంగా చేడయం ఆదర్శనీయమన్నారు. దేశంలో తొలిసారిగా పశుపోషకుల కోసం నిర్వహిస్తున్న పశు ఔషద బ్యాంకు కోసం అదనపు సమయం కేటాయిస్తూ 20 కోట్ల ఆదాయాన్ని సృష్టించడం ఆయ నకే సాధ్యమైందని అన్నారు. ఆసుపత్రి ఆవరణలో భవిష్యత్ రైతులకు ఉచితంగా పశుగ్రాస విత్తనాలు, గడ్డి కణుపుల సరఫరా కోసం పెంచుతున్న పశుగ్రాస క్షేత్రాన్ని ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరి అసిస్టెంట్ సర్జన్ సురేంద్ర, బడేటి శివ, కొండాసాయి కృష్ణ, చంద్రకళ, సాగర్ లు పాల్గొన్నారు.

లక్ష మంది రైతులతో బహిరంగ సభ

ప్రజాపక్షం/తుర్కపల్లి: మండల కేంద్రంలో శుక్రవారం రోజున ఏఐకేఎస్ 36వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ, సిపిఎం మండల కార్యదర్శి పోతరాజు జహంగీర్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల పురిటి గడ్డ అయిన నల్లగొండ పట్టణంలో నవంబర్ 15 నుండి 18 వరకు జరిగే అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నారని, 'అగ్రి షో'వ్యవసాయ రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులపై వ్యవసాయ ప్రదర్శన శాల నిర్వహిస్తున్నారని తెలిపారు. నవంబర్ 15న లక్ష మంది రైతులతో భారీ ర్యాలీ, బహిరంగ సభ జరుగుతుందని దీనికి వేలాది మంది రైతులు వ్యవసాయ కూలీలు పేదలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు, జాతీయోద్యమ స్ఫూర్తితో బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా 1936లో ఏర్పడిన అఖిల భారత కిసాన్ సభ నేటికి 90 ఏళ్లు పూర్తి చేసుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు గడ్డమీది నరసింహ, తలారి మాతయ్య, తూటి వెంకటేశం, నాయకులు సిల్వర్ పెంటయ్య, కోట నాగరాజు పాల్గొన్నారు.



అన్ని పంచాయతీల్లో పనులు ప్రారంభం

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: వివిజి రాంజీ పథకం కింద జిల్లా లోని అన్ని గ్రామ పంచాయతీలలో పనులు ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరిం చారు.శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధి కారులతో వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నల్లగొండ జిల్లాలో పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధిలో భాగంగా వివిజి రాంజీ కింద చేపట్టిన పనులపై జిల్లా కలెక్టర్ వివరాలను సీఎ స్‌కు తెలియజేశారు. ఈ నెలలో వివిజి రాంజీ కింద ప్రతిరోజూ 62,637 మంది కూలీలు పనిచేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పథకం కింద గుర్తించిన పనులన్నింటినీ చేపట్టడం జరిగిందని,ఈ సంవ త్సరం 7,200 కొత్త జాబ్ కార్డులు ఇచ్చామని,గతంలో తొలగించిన 4,300 జాబ్ కార్డులను కూడా తిరిగి యాక్టివేట్ చేయడం జరిగిం దని,ప్రతి 40 మంది కూలీలకు ఒక మేట్‌ను,అలాగే ఫీల్డ్ అసిస్టెం ట్లను కూడా నియమించామని చెప్పారు.వివిజి రాంజీపై అందరు సర్పంచులు, క్షేత్ర సహాయకులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిం చామని,గతంలో గ్రామానికి 17గా ఉన్న కూలీల సంఖ్య ప్రస్తుతం 64కు పెరిగిందని,ఇకపై ప్రతివారం 10 మందిని పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని,ఎల్ నినోను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో నీటి నిల్వ కట్టడాలు చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. వివిజి రాంజీ కింద మంజూరైన పనులన్నింటినీ గ్రౌండ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు.ఈ వీడియో కాన్ఫ రెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,డీఆర్‌డిఓ శేఖర్ రెడ్డి,డీఈఓ సుశిందర్ రావు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు తదితరులు హాజరయ్యారు.

పెండింగ్ పనులకు పూర్తి చేయాలి



ప్రజాపక్షం/యాదాద్రిభువనగిరి: ప్రభుత్వ లక్ష్యాల సాధనలో జిల్లాల పనితీరు మెరుగుపడాలని, విద్య, ఉపాధి హామీ (వివిజి రామ్ జి), చేయూత పింఛన్ల పరిశీలన, తాగునీటి సరఫరా మరియు గృహ నిర్మాణ శాఖల అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. శుక్రవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమగ్ర శిక్ష అభి యాన్, పీఎం శ్రీ పథకాల నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సీఎస్ ఆదేశించారు. జనవరి మొదటి వారంలోగా వ్యయాన్ని వంద శాతానికి చేర్చి, కేంద్రం నుంచి అదనపు నిధులు రాబట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనం తరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ.. పీఎం శ్రీ పాఠశాలల్లో పెండింగ్ పనులను త్వరితగ తిన పూర్తి చేయాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. పీఎం శ్రీ పాఠశాలల్లో పెండింగ్లో ఉన్న పనుల పురోగతిపై స్పష్టమైన నివేదిక అందించాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో వ్యక్తిగత ఇంకుడు గుంతలు బోర్ వెల్ రీఛార్జ్ నిర్మాణాలు, పంట కుంటల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అదే విధంగా భూసేకరణ ప్రక్రియలో పెండింగ్ అంశాలను పరిష్క రించాలన్నారు.ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జెడ్పీ సీఈవో శోభారాణి, డీఆర్డీఓ నాగిరెడ్డి, విద్యా శాఖ అధికారి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.